పశువైద్యంపై పట్టింపేది?

- శిథిలావస్థలో రెబ్బెన పశువైద్యశాల
- ఒక్కరే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్
- ఇబ్బంది పడుతున్న పశుపోషకులు



శిథిలావస్థలో రెబ్బెన పశువైద్యశాల భవనం

రెబ్బెన: నిజాంకాలం నాటి పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పైకప్పు పెచ్చులూడుతున్నా.. పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కొత్త భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నా.. నిధులు మంజూరు కావడం లేదు. కనీసం అందుబాటులో ఖాళీగా ఉన్న వేరు శాఖకు చెందిన భవనాన్ని తాత్కాలికంగా పశు వైద్యశాలకు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే పశువుల యజమానులు శిథిలావస్థకు చేరిన భవనంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దానికి తోడు ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పశువులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు.

మూడు ఆసుపత్రులకు ఒక్కరే..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా.. వాటి పరిధిలోని పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం రెబ్బెన మండల కేంద్రంలో, నంబాలలో పశువైద్యశాలను, నవేగాంలో గ్రామీణ పశువైద్యశాలను ఏర్పాటు చేసింది. వాటి పరిధిలో ఆవులు 12,270, గేదెలు 3,386, గొర్రెలు 9,745, మేకలు 11,046తో పాటు కోళ్లు 12,620 ఉన్నాయి. అయితే రెబ్బెన, నంబాల పశువైద్యశాలల్లో ఒక్కో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఉండాల్సి ఉండగా.. నంబాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టు గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. దానికి తోడూ నవేగాం గ్రామీణ పశువైద్యశాలలో ఎల్ఎస్ఏ (లైవ్ స్టాక్ అసిస్టెంట్) ఖాళీగా ఉంది. దీంతో మూడు పశువైద్యశాలల భారమంతా రెబ్బెన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌పై పడుతోంది.

శిథిల భవనంతో ఇబ్బందులు..

మండల కేంద్రంలోని రెబ్బెన పశువైద్యశాల భవనం నిజాం కాలంలో నిర్మించింది. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనంలో రెండు గదులు మాత్రమే ఉండడంతో సిబ్బంది ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నారు. ఒక గదిని సిబ్బంది కోసం, ఇతర సామగ్రి కోసం వినియోగిస్తుండగా మరో గదిని మందుల కోసం ఉపయోగిస్తున్నారు. అయితే నిజాం కాలంలో నిర్మించిన భవనం కావడంతో పైకప్పు పెచ్చులూడుతూ.. ఏ క్షణాన కూలి పోతుందో తెలియక సిబ్బంది భయపడుతున్నారు. రూ. 18.5లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా కరోనా కారణంగా నిధుల కొరతతో భవనం మంజూరు మోక్షం లభించలేదు. మండల కేంద్రంలో ఖాళీ ఉన్న వేరే ప్రభుత్వ భవనాన్ని పశువైద్యశాల కోసం తాత్కాలికంగా కేటాయిస్తే సమస్యకు కొంతమేర పరిష్కరించవచ్చు.

భయం భయంగా విధులు



రెబ్బెన పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియడం లేదు. దీంతో క్షణక్షణం భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపించిన ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటం లేదు. తప్పనిసరి పరిస్థితిలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

– సాగర్, పశువైద్యాధికారి, రెబ్బెన

ఎరువుల కొరత రాకుండా చూస్తాం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయ రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి వ్యవసాయశాఖ అధికారులతో ఎరువుల నిల్వ, సుబాబుల్, ఇంక్యులిప్టస్ మొక్కల పెంపకం ద్వారా అధిక లాభాల సాధనపై సమీక్ష నిర్వహించారు. అన్ని మండలాల్లో ఎరువులు, పిచికారి మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగ్రో, డీసీఎంఎస్, ప్యాక్స్ ద్వారా రైతులు ఎరువులు పంపిణీ చేయాలన్నారు. వర్షాకాలంలో పంటలకు సరిపడా ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలని, వరి నాట్లు వేసే సమయంలో ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధిక ఆదాయం పొందే విధంగా కృషిమిత్ర, డ్రోన్ మిత్రల సహకారం తీసుకోవాలని, ఆర్ఓఎఫ్ఆర్, పట్టాదారులు మరణించిన వారి వివరాలను సేకరించి నివేదిక అందించాలని, వారికి కూడా రైతుబీమా వర్తిస్తుందన్నారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, డీఆర్‌డీవో సురేందర్, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

చింతలమానెపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో కోటప్రసాద్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విస్తారంగా మొక్కలు నాటితేనే సంవృద్ధిగా వర్షాలు పడుతాయన్నారు. నాటిన ప్రతీ మొక్కనూ సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో గోవర్ధన్ సింగ్, హెచ్ఎం జయరాజు, కార్యదర్శి ఆసిఫ్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కెరమెరి: మొక్క నాటుతున్న విద్యార్థులు

కెరమెరి: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల ఆవరణలో 150కు పైగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా మొక్కల ప్రాముఖ్యతను టీచర్లు వివరించారు. నాటిన ప్రతిమొక్కనూ బతికించాలన్నారు.

బెల్లం పటిక పట్టివేత

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన గుడుంబా తయారు చేస్తున్న వ్యక్తులకు సిర్పూర్(టి) నుంచి అక్రమంగా బెల్లం, పటికలను రవాణ చేస్తున్న వ్యక్తులను బుధవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆటోలో 40 కేజీల బెల్లం, 80 కేజీల పటికను షేక్ ఆసిఫ్, బాబుజానీలు తరలిస్తున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

చినుకు పడితే చిత్తడే



దహెగాం నుంచి లగ్గాం వెళ్లే రోడ్డు దుస్థితి

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- గుంతల్లో నిలుస్తున్న వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు

దహెగాం: వర్షాకాలం వచ్చిందంటే చాలు అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో మరుగునీరు, వరద రోడ్లపై పారుతుంది. రోడ్లు గుంతలుగా ఉండడంతో గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పల్లెల్లో ప్రజాప్రతినిధుల పాలన ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. ప్రత్యేకాధికారులు పంచాయతీ, మండలంపై దృష్టి సారించక పోవడంతో పారిశుధ్యం పడకేసింది. అసలే వ్యాధుల కాలం వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బురదమయంగా..

మండల కేంద్రంలోనే రోడ్లు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో ఇలా బురదమయంగా మారుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లే దారి, లగ్గాం వైపు వెళ్లే దారి, మండల కేంద్రంలో అంగడీబజార్‌లో బురదమయంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ..

మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. డ్రెయినేజీ సక్రమంగా లేక పోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతుంది. గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ కావడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. నిలిచి వర్షపు నీరు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గుంతలు పడిన చోట మొరం పోయక పోవడంతో వర్షపు నీరు నిల్వ ఉంటుందని వాపోతున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చిత్తడిగా మారిన దార్లకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



పెంచికల్‌పేట్‌లో..

- తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి

రెబ్బెన: ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని ఆశ వర్కర్ల సంఘం నాయకురాలు అనిత, సునీతలు అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ డే నిర్వహించారు. తహసీల్దార్ జ్యోత్స్న, పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేశారు. ఆశ వర్కర్లు అనిత, సునీత, సుకన్య, లలిత, రాజేశ్వరీ, ఛాయ, సరోజ, పద్మ, వినోద పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి..

కౌటాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు జాడి మోరేశ్వర్ అన్నారు. బుధవారం కార్మికుల డిమాండ్ డే సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పాలతకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశవర్కర్లు, పంచాయతీ కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతం అందించాలని, కనీస వేతనం చెల్లించడంలో జాప్యం చేస్తుందన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

కాగజ్‌నగర్ రూరల్: కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆల్ ఇండియా డిమాండ్ డే సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్.త్రివేణి, శంకర్, పద్మ, సంజీవ్, మల్లేశ్వరి, కుమారి, కృష్ణవేణి, మంచశీల, జరీనా పాల్గొన్నారు.

దహెగాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. నాయకులు వజ్రమ్మ, జయప్రద, జ్యోతి, రాజేశ్వరీ, అరుణ్, రంగమ్మ, పాల్గొన్నారు.

బెజ్జూర్: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భూమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దుర్గాదేవి, స్వప్న, తిరుపతమ్మ, పార్వతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

‘అగ్నివీర్’కు సన్మానం



రాహుల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి రాహుల్ అగ్నివీర్ పథకంలో ఎంపికైన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. 2020లో పదో తరగతి చదివి దేశ సేవ చేయడం మాకెంతో ఆనందాన్ని, గౌరవాన్ని ఇచ్చిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అలాగే నెహ్రూనగర్‌లో రాహుల్‌తో పాటు తల్లిదండ్రులను ఎస్సై గుంపుల విజయ్ సన్మానించారు. కార్యక్రమంలో టీచర్లు సంతోష్ కుమార్, రవీందర్, ధన్‌లాల్, సమ్మయ్య, నరేశ్, సుగుణ, విజయకుమారి, మహేశ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎడ్లను సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్: మారుముల గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎడ్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఏకలవ్య ఫౌండేషన్ వైస్ చైర్మన్ మిహిర్ పరియల్ అన్నారు. బుధవారం సిర్పూర్(యూ) మండలంలోని బాబ్జీపేట్ గ్రామంలో 20 మంది రైతులకు ఉచితంగా ఎడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ చక్రేశ్వర గోశాల ఆధ్వర్యంలో రూ.6.90 లక్షల విలువ గల ఎడ్ల పంపిణీ చేశామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కుమురం భీం ప్రాజెక్టు జిల్లా హెడ్ విజయ్, బొర్ల కుంట ప్రాజెక్టు మేనేజర్ గణేశ్, ఫీల్డ్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లు పంపిణీ చేస్తున్న మిహిర్ పరియల్

ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించాలి

కెరమెరి: 317 జీవో ద్వారా వచ్చిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని బాధిత ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్‌గా దామేదర రాజనరసింహను నియమించడం అభినందనీయమన్నారు. గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తులను జూన్ 30 వరకు ఆన్‌లైన్ విధానంలో బాధితులు ఇవ్వడం జరిగింది. నివేదికను ప్రభుత్వానికి సమర్పించి న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు క్రాంతి, శివప్రసాద్, సురేశ్, నరేశ్, వినీత్, శ్రీధర్, వినోద్, హరీష్, యోగేశ్, ప్రదీప్, అరుణ్, సాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎల్లో, రెడ్‌కార్డు విధానం రద్దు చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి యాజమాన్యం నూతనంగా తీసుకువచ్చిన ఎల్లో, రెడ్‌కార్డు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ కైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యజయాన్యం రెగ్యులేషన్ సీఎంఆర్ 2017లో లేనటువంటి ఎల్లో, రెడ్‌కార్డు సిస్టం అంటూ సూపర్‌వైజర్లపై, కార్మికులపై ఒత్తిడి చేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, రాజేశ్, దివాకర్, కైరిగూడ సహాయ కార్యదర్శి ఓదెలు, మైన్స్ అండ్ సేఫ్టీ కమిటీ సభ్యులు కోటి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నరేశ్, తిరుపతి, రమేశ్, శివప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

పనులు శరవేగంగా పూర్తి చేయాలి

కౌటాల: కౌటాల 132/33 కేవీ నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని కోయగూడ సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయితే సిర్పూర్ నియోజకవర్గంలో లోవోల్టేజ్, కరెంట్ కోతల సమస్య పరిష్కారమవుతుందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రానున్న మూడు నెలల్లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, దుర్గం మోతిరాం, బండి రాజేందర్ గౌడ్, తిరుపతి, రమేశ్, సుధాకర్, మిథున్, రామయ్య పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కాగజ్‌నగర్ వాకర్స్ బుధవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వృద్ధులు, యువకులు ఎస్పీఎం క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్నారని, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ మల్లేశ్, తుమ్మరమేశ్, ముంజం ఆనంద్‌కుమార్, రాం, రాంకుమార్, వెంకన్న, మధుకర్, శ్రీనివాస్, నరసింహస్వామి, మానిక్యం, జమీల్, రాంకుమార్, రమేశ్, జగన్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వాకర్స్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన జనన్య రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ లిబిన్ బుధవారం తెలిపారు. ఈనెల 7న ఆసిఫాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 12 నుంచి 14 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు రాకేశ్, కిరణ్, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కెరమెరి: అంగన్‌వాడీ, ఆయాలకు, ఎండీఎం కార్మికులకు, హెల్పర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ కన్వీనర్ కూటికల ఆనంద్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ సంతోశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి అన్ని సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ మతోన్మాదాలకు దోచిపెడుతుందని మండిపడ్డారు. అనేక కాలంగా కార్మికుల సమస్యలు అలాగే మిగిలి పోతున్నాయని, ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో పావిత్ర, గుణసుందరి, కవిత, పద్మ, రాధా, అయ్యాబాయ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. షీటీం హెడ్ కానిస్టేబల్ సునీత మాట్లాడుతూ.. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని కోరారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు, ఫేస్‌బుక్, వాట్సాప్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు షీటీంలు పని చేస్తున్నాయని, ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సన్మానం

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఆర్. ప్రకాశ్‌రెడ్డి బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రకాశ్‌గౌడ్, క్రుష్ణంరాజు, అడప సతీశ్, రమేశ్, సురేశ్‌చారి, తారు, అబ్దుల్ హన్నన్, మిలీన్ పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి

చింతలమానెపల్లి: మండలంలోని శివపెల్లి వాగుపై వంతెన నిర్మించాలని డబ్బాకు చెందిన నాయకులు బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గూడెం గ్రామం నుంచి శివపెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గత పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులకు సరైన రవాణా మార్గం లేకుండా పోయిందన్నారు. అలాగే గూడెం నుంచి చింతలమానెపల్లి ప్రధాన రహదారిపై గుంతలు పడ్డాయని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. నాయకులు జుమ్మిడి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

‘పోలీసులపై చర్యలు తీసుకోవాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: ఉస్మానియా యునివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను పోలీసులు లాక్కెళ్లడం అప్రజా స్వామికమని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, కార్యదర్శి సంతపకుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. యునివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవరేజ్ చేసేందుకు వెళ్లిన జీటీవి ప్రతినిధి శ్రీచరణ్‌పై దాడి చేయడం సిగ్గు చేటన్నారు.